క్లుప్తంగా

ఇసుక రీచ్‌పై నేడు ప్రజాభిప్రాయ సేకరణ

సిద్దవటం : మండలంలోని మూలపల్లె గ్రామంలో బుధవారం గ్రామసభ నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ పులిరామ్‌సింగ్ తెలిపారు. మంగళవారం ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించి మాట్లాడారు. మూలపల్లె గ్రామ సమీపంలోని పెన్నానదిలో నూతన ఇసుక రీచ్‌పై ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రానున్నారని చెప్పారు. గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి బ్లీచింగ్, అబెట్ ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓ చలపతి, గ్రామ పంచాయతీ కార్యదర్శి రిహాన్, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

నేడు నవోదయలో యూత్ పార్లమెంట్ పోటీలు

రాజంపేట : జవహర్ నవోదయ విద్యాలయంలో బుధవారం యూత్ పార్లమెంట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈమేరకు ప్రిన్సిపల్ గీతా మంగళవారం ఆకేపాటి ఎస్టేట్‌లో ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాథరెడ్డిని ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా హాజరుకావాలని కోరారు. ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో జేఎస్‌వీ సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం


చిరంజీవి, ఎస్‌ఐ

సిద్దవటం : ద్విచక్ర వాహనాదారులు హెల్మెట్ లేకుండా ప్రయాణం ప్రమాదకరమని ఎస్‌ఐ చిరంజీవి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ కడప – చెన్నై ప్రధాన రహదారిపై ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులు ఇద్దరు మాత్రమే వెళ్లాలని, అతివేగం ప్రమాదకరమన్నారు. ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. చర్యలు పాటించని వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆటోలలో ఎక్కువ మంది ప్రయాణికులను ఎక్కించుకోకూడదని సూచించారు.

పాఠశాలలో మాక్‌డ్రిల్


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయచోటి టౌన్ : వరదలు వచ్చినప్పుడు ఎలాంటి సహాయక చర్యలు చేపట్టాలనే విషయాలపై విద్యార్థులకు రాయచోటి ఫైర్ ఆఫీసర్ వెంకటరామిరెడ్డి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వరదలు, నీటి ప్రవాహాలలో చిక్కుకున్న వారిని ఎలా కాపాడలనే అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో కలసి మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘానికి నూతన కార్యవర్గం

పుల్లంపేట : మండల పద్మశాలీ సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు దొంతు శివయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బిట్టా రెడ్డయ్య బాబు, కార్యదర్శిగా భీమిశెట్టి నారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు శివయ్య తెలిపారు.

మృతురాలికి నివాళి

ఓబులవారిపల్లె : ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుండి కిందపడి మృతి చెందిన వీటి లక్ష్మీదేవి (48) మృతదేహాన్ని మంగళవారం ఎమ్మెల్యే అరవ శ్రీధర్, టీడీపీ ఇన్‌చార్జ్ రూపానందరెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గాలివీడు : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ పోలీసులు మంగళవారం సీజ్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రంలోని తలముడిపి గ్రామం పాపాఘ్ని నదీ పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న సమాచారంతో ఎస్‌ఐ రామకృష్ణ తన సిబ్బందితో దాడి నిర్వహించి ట్రాక్టర్‌ను, డ్రైవర్ భాస్కర్‌ను గరుగుపల్లి క్రాస్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

అలంకరణలో కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె గుట్టపై వెలసిన శ్రీ కాలభైరవుడు శ్రీ భద్రకాళీశ్వరుడి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం అమావాస్య పూజలలో భాగంగా కాలభైరవుడికి స్వామి పూజలు నిర్వహించారు. అంతకు ముందుగా జమ్మిచెట్టుకు పూజలు చేశారు.

విద్యాసామగ్రి పంపిణీ

సుండుపల్లె : గుండ్లపల్లి పంచాయతీ జేసీ కురవపల్లికి చెందిన పోలూరు నాగార్జున, నాగమణి దంపతుల కుమార్తె పుట్టినరోజు సందర్భంగా గుండ్లపల్లి, సొంతవారిపల్లిలోని ఆరు ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పలకలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బుక్కే బీమ్లా నాయక్, ఆదినారాయణ, నాగమణి నాయక్, రెడ్డయ్య, గిరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభం.. ప్రశ్నార్థకం

- అభివృద్ధికి అమడదూరంలో ముక్తికనుమ బౌద్ధారామం
- కోట్లు వెచ్చించి నిర్మించినా ప్రారంభానికి నోచుకోని అతిథి గృహం


ముక్తి కనుమ వద్ద నిర్మించిన పర్యాటక అతిథి గృహం

నందలూరు : మండలంలోని ఆడపూరు ముక్తి కనుమ వద్ద దాదాపు రూ.1.30 కోట్ల రూపాయలతో నిర్మించిన బౌద్ధారామం పర్యాటక అతిథి గృహం పూర్తయ్యి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. 2017లో అప్పటి ప్రభుత్వం రాష్ట్ర పర్యాటకశాఖ బౌద్ధారామం అభివృద్ధి కోసం నిధులు వెచ్చించి పర్యాటక అతిథి గృహం, ధ్యాన మందిరం, సమావేశ మందిరంతోపాటు పార్కు, టాయిలెట్స్‌ను నిర్మించారు. అతిథి గృహంలో ప్రత్యేకంగా బుద్ధ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. కీ.శే ఒకటవ శతాబ్దానికి చెందిన బౌద్ధారామ స్తూపాలు ముక్తి కనుమలలో ఉన్నాయి. 1977లో అప్పట్లో రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు సాగాయి. 1979లో ముక్తి కనుమపై 21 స్తూపాలు బయల్పడ్డాయి. ఆ తరువాత ప్రభుత్వాలు సరైన ప్రచారాలు నిర్వహించకపోవడంతో ఈ ప్రాంతానికి తగినంత ఆదరణ లభించలేదు. ఇప్పటికైనా పూర్తయిన అతిథి గృహం ప్రారంభించి బౌద్ధస్తూపాలకు ప్రాచుర్యం చేస్తే ఈ ప్రాంతానికి సందర్శకుల తాకిడి ఉంటుందన్నారు. అలానే సమీపంలోని సౌమ్యనాథస్వామి ఆలయం ఉండటంతో తప్పనిసరిగా ఆలయానికి భక్తుల తాకిడి నెలకొంటుందని స్థానికులు తెలియజేశారు. రాయలసీమలో తక్కువ ఉన్న బౌద్ధారామాలను మరింత అభివృద్ధి పరచాల్సిన బాధ్యత పర్యాటకశాఖపై ఉందని పలువురు మేధావులు అభిప్రాయపడ్డారు. అతిథి గృహం ప్రారంభ విషయమై జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణంను వివరణ అడుగగా కాంట్రాక్ట్ పద్ధతినా అతిథి గృహాన్ని నడిపేందుకు టెండర్లు పిలిచామని ఎవరూ ముందుకు రాలేదని చెప్పారు. మరోసారి టెండర్లను పిలిచి అతిథి గృహాన్ని వినియోగంలోకి తెస్తామని తెలియజేశారు.


ముక్తి కనుమ వద్ద ఉన్న బౌద్ధారామాలు

ఆశాలకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోండి


డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్యకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

రాయచోటి అర్బన్ : గతంలో ఆశ వర్కర్లకు ఇచ్చిన అనేక వాగ్దానాలు, హామీలకు సంబంధించిన జీఓలు, సర్క్యులర్‌లను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని వాల్మీకీ వీధిలోని అర్బన్ పీహెచ్‌సీలో ఆయన ఆశ వర్కర్లతో కలసి డీఎం అండ్ హెచ్‌ఓ కొండయ్యను కలసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆశాలపై పనిభారం తగ్గించాలన్నారు. ఆశాలతో గతంలో ప్రభుత్వం చర్చలు జరిపిన సందర్భానికి సంబంధించిన మినిట్స్ కాపీని ఇవ్వాలంటూ కోరారు. ఆశాలకు ఉన్నతాధికారులు పని విరామం ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాజకీయ ఒత్తిళ్లకు ఆశాలను తొలగించడాన్ని ఖండించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు : మండలంలోని ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు కలసికట్టుగా పనిచేయాలన్నారు. తమ పరిధిలో ఉన్న సమస్యలను గుర్తించి తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అనుదీప్, మండల కో–ఆప్షన్ సభ్యులు కరిముల్లా ఖాన్, మండల పార్టీ అధ్యక్షులు అన్నం నాగేంద్ర, నడివీధి సుధాకర్, ఎం.చంద్రశేఖర్, గ్రీష్మంత్ రెడ్డి, శ్రీధర్, మన్సూర్, పి.నాగసుబ్బయ్య, కె.చంద్ర, శ్రీనివాసులు, పి.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి


ఓబులవారిపల్లె: ఆశ డే కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శైలజ


సుండుపల్లె: ఆశ వర్కర్‌లకు సూచనలు చేస్తున్న వైద్యాధికారి శేఖర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న సందర్భంగా అప్రమత్తంగా ఉండి ప్రజలకు వైద్య సేవలు అందించాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ శైలజ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆశ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ గ్రూపులకు సకాలంలో టీకాలు పంపిణీ చేయాలని, ప్రజలు దోమలు వ్యాపించకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలించి వైద్యులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

లక్కిరెడ్డిపల్లె : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలకు కోనంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి సిద్దయ్య తెలియజేశారు. మంగళవారం మండలంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆరోగ్య సిబ్బందితో ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణుల నమోదు తప్పనిసరిగా చేయాలన్నారు. వారికి పౌష్టికాహారం, మందులు సకాలంలో తీసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. బీపీ, షుగర్ వ్యాధులను గుర్తించడానికి 30 సంవత్సరాల వయసు కలిగిన వారందరికీ పరీక్షలు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సుండుపల్లె : రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ డే కార్యక్రమాన్ని డాక్టర్ శేఖర్ రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ నరేష్ మాట్లాడుతూ దగ్గు, సాయంత్రం జ్వరం రావడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతిలో నొప్పిరావడం, గళ్లలో రక్తం పడటం వంటి లక్షణాలు ఉంటే సమీప ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలన్నారు. టీబీ జబ్బు నిర్ధారణయితే ఉచితంగా మందులు ఇస్తారని తెలియజేశారు. చైల్డ్ ఫౌండ్ డీఆర్‌పీ వల్లి మాట్లాడుతూ హెచ్‌ఐవీతో బాధపడుతున్న వారికి వాడిన సిరంజీలు, వారితో లైంగిక సంబంధం వలన రక్తమార్పిడి జరిగి హెచ్‌ఐవీ వ్యాధి వచ్చే అవకాశం ఉందని తెలిపారు.

మంగంపేట సమస్యలు పరిష్కరించండి

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లె హరిజనవాడ అరుంధతివాడ గ్రామాల సమస్యలు పరిష్కరించాలని రాజంపేట సబ్ కలెక్టర్ వైఖోమ్ నైదియా దేవికి డీఆర్‌యూసీసీ మాజీ సభ్యులు తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆమెకు మంగంపేట కాపుపల్లె, ఆర్‌ఆర్–5 ప్యాకేజీలు, సర్వే నెంబరు – 8లో శ్మశానవాటిక ప్రత్యామ్నాయ ఏర్పాటు తదితర అంశాలపై వివరించారు.

వీరభద్రుడికి పల్లకీ సేవ


పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

రాయచోటి టౌన్ : భద్రకాళీ సమేత వీరభద్రస్వామి పల్లకీ సేవ నిర్వహించారు. మంగళవారం స్వామి జయంతి వేడుకలలో భాగంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చి పట్టణ పుర వీధులలో ఊరేగించారు.

ఎన్‌బీఓఈఐఎంఎస్‌లో విద్యార్థిని ప్రతిభ


డా.వేమిరెడ్డి సాయిచందన

రాయచోటి : నేషనల్ బోర్డు ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్స్‌లో 735 ర్యాంక్‌తో వి.సాయి చందన రాణించింది. రాయచోటికి చెందిన డాక్టర్ వేమిరెడ్డి సాయి చందన నేషనల్ బోర్డు పరీక్షలలో ప్రతిభను కనబరిచి ర్యాంకును సాధించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా వీరభద్రస్వామి జయంతి వేడుకలు


చిన్నమండెం: అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి టౌన్ : జిల్లా కేంద్రంలో కొలువైన శ్రీ వీరభద్రస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్వామి వారి జయంతి సందర్భంగా స్వామివారికి, భద్రకాళీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కాగా వేడుకలలో రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఆలయ చరిత్రను కన్నడ భాషలో ముద్రించిన పుస్తకాన్ని మంత్రి సతీమణి ఆలయ అధికారులు, భక్తులతో కలసి ఆవిష్కరించారు.

అర్జీల పరిష్కారానికే ప్రజా దర్బార్

చిన్నమండెం : ప్రజా దర్బార్ కార్యక్రమం ద్వారా అర్జీలకు సత్వర న్యాయం చేకూర్చడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలో మంత్రి నివాసం నందు ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన తూర్పుపల్లె గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.

కళాశాల తనిఖీ

సంబేపల్లె : మండల పరిధిలోని దేవపట్ల సమీపంలోని అంబేడ్కర్ బాలికల కళాశాలను మంగళవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, నాగేశ్వర్‌నాయుడు ఉన్నారు.

నివాళి

రామాపురం : నీలకంఠ్రావుపేట గ్రామంలో మంగళవారం అనారోగ్యంతో ఆసిఫ్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆసిఫ్ మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి


మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

నందలూరు : జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ బాబా ఫకృద్దీన్ పేర్కొన్నారు. లోక్ అదాలత్‌కు సంబంధించి నందలూరు కోర్టు పరిధిలోని పోలీస్ అధికారులతో, న్యాయవాదులు, రెవెన్యూ, బ్యాంకు అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 14న జరిగే జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి సివిల్, రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమర్నాథ్, ఎంపీడీఓ సౌభాగ్యమ్మ, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుళ్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట : రాజంపేట సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలు, ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన జైలు పరిసరాలు, రిజిస్టర్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుకజలాలు


ఒంటిమిట్ట చెరువులోకి చేరుతున్న నీరు

ఒంటిమిట్ట : మండల కేంద్రంలోని చెరువుకు మంగళవారం ఇరిగేషన్ అధికారుల ఆధ్వర్యంలో సోమశిల వెనుకజలాలను విడుదల చేశారు. గత కొన్నేళ్లుగా వర్షాలు లేక సోమశిల వెనుకజలాలు ఆశించిన స్థాయిలో రాకపోవటడంతో శ్రీరామ ఎత్తిపోతల పథకం కొన్నేళ్లుగా నిరుపయోగంగా పడి ఉంది. అంతేకాకుండా ఈ పథకానికి సంబంధించి కొన్నిచోట్ల పైప్ లైన్ దెబ్బతింది. దీంతో ఒంటిమిట్ట చెరువులో చుక్కనీరు లేక బోసిపోవడంతో రైతులు చాలా ఇబ్బందులకు గురయ్యారు. ఇది ఇలా ఉండగా ఈ మధ్యకాలంలో రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో మండల పరిధిలోని కుడమలూరులో సోమశిల వెనుకజలాలు భారీ ఎత్తున వచ్చి చేరుతున్నాయి. దీంతో నీరు లేక బోసిపోయిన ఒంటిమిట్ట చెరువుకు ఇరిగేషన్ అధికారుల చొరవతో శ్రీరామ పథకం పైప్‌లైన్ సమస్యలను పరిష్కరించి మంగళవారం ట్రైల్ రన్ ద్వారా ఒంటిమిట్ట చెరువుకు సోమశిల వెనుక జలాలను వదిలారు.

అసత్య ఆరోపణలు మానుకోండి


విలేకరులతో మాట్లాడుతున్న రైతులు

గాలివీడు : తమ పట్టా భూములను రహదారికి కేటాయించాలనడం సరికాదని రైతులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటశివారెడ్డి, సిద్దారెడ్డిలు పేర్కొన్నారు. మంగళవారం గాలివీడులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైతులు మాట్లాడారు. మండలంలోని ఎగువ గొట్టివీడు గ్రామం జంగంపల్లి వద్ద గ్రామంలోని ఇతర రైతులు వారివారి పొలాల్లోకి కాలినడకన వెళ్లేందుకు మా పూర్వీకులు స్థానికులకు అవకాశం కల్పించారన్నారు. ఇప్పుడూ రైతులు వెళ్లడానికి తాము అడ్డుచెప్పడంలేదన్నారు. కేవలం లారీలు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు వెళ్లడానికి అభ్యంతరం తెలిపామన్నారు. కేవలం రైతుల అవసరాల కోసం అంగీకరించామే గ్రామంలో కొందరి అవసరాలకు వాడుకుంటామంటే ఒప్పుకునేది లేదని స్పష్టం చేశారు. సర్వే నంబరు 1003లో ఇరిగేషన్ వంక ఉందని అక్కడికి రైతులు వెళ్లేందుకు వేరే దారి ఉన్నా ఈ మార్గం గుండానే భారీ వాహనాలతో వెళ్తామంటే అడ్డుకోవడం తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఈ విషయంలో రాజకీయాలు తీసుకురావడాన్ని తప్పుబట్టారు. ఇందులో ఎలాంటి రాజకీయాలు, రాజకీయ నాయకుల ప్రమేయం లేదని చెప్పారు. దారి విషయమై గ్రామానికి చెందిన బి.శంకరయ్య, కె.బాలజీ, వెంకటప్ప తదితరులు తమను బెదిరింపులకు దిగారని, దీంతో ఒంటరిగా గ్రామంలో తిరగాలంటే భయంగా ఉందన్నారు. ఈ విషయంపై వెంటనే జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి మాకు న్యాయం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బిక్కు బిక్కుమంటూ విధులు


శిథిలావస్థకు చేరుకున్న ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం


కార్యాలయంలోని గదిలో పెచ్చులూడిన స్లాబ్

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని ఎంపీడీఓ ప్రాంగణంలో ఉన్న గ్రామీణ తాగునీటి పారుదల శాఖ (ఆర్‌డబ్ల్యూఎస్) భవనం శిథిలావస్థకు చేరింది. కార్యాలయంలో పని చేస్తున్న అధికారులు ఎప్పుడు ఏ ప్రమాదం పొంచి ఉందోనన్న భయంతో విధులు నిర్వహిస్తున్నారు. కార్యాలయంలోని గదులలో స్లాబు పెచ్చులు ఊడి ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తున్నాయి. దాని గురించి పట్టించుకునే వారే కరువయ్యారు. వర్షం పడితే భవనంలో స్లాబ్ నుంచి పడుతున్న వర్షపు నీటి వల్ల రికార్డులు పాడవుతున్నాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన భవన నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై ఏఈ సుబ్రమణ్యంను వివరణ కోరగా కొత్త భవన నిర్మాణానికి సంబంధించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపామన్నారు. అలాగే ఎమ్మెల్యే, ప్రభుత్వ పెద్దలకు తెలియజేస్తామని పేర్కొన్నారు.


గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిస్టరీ గెస్ట్ లెక్చరర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ శ్రీదేవి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం మాట్లాడుతూ ఎంఏ హిస్టరీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. కావున ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 10వ తేదీలోపు కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించి తమ దరఖాస్తులు సమర్పించాలని వారు కోరారు.

ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

పెనగలూరు : వినాయక చవితి ఉత్సవాలకు గ్రామాల్లో విగ్రహాలు పెట్టేవారు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్‌ఐ రవిప్రకాష్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ఉత్సవాలు నిర్వహించేవారు ఆన్‌లైన్ ద్వారా కచ్చితంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే విద్యుత్‌శాఖ అనుమతి పొందాలన్నారు. సిద్దవరం నుంచి దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

వరద సహాయక చర్యలకు తరలిన సిబ్బంది


చిట్వేలి: విజయవాడకు వెళుతున్న కార్మికులు

రైల్వేకోడూరు అర్బన్ /చిట్వేలి : కృష్ణా నది వరద ముంపు ప్రాంతాలలో సహాయక చర్యలు చేపట్టడానికి కోడూరు, చిట్వేలి పంచాయతీలకు సిబ్బంది, వారికి కావాల్సిన సామగ్రిని ప్రత్యేక వాహనంలో విజయవాడకు పంపినట్లు పంచాయతీల అధికారులు మంగళవారం తెలిపారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

లక్కిరెడ్డిపల్లె : పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని అంగన్వాడీ సూపర్‌వైజర్ దాదా బీ పేర్కొన్నారు. పోషకాహార వారోత్సవాల్లో భాగంగా లక్కిరెడ్డిపల్లె టౌన్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు సంతులిత ఆహారం తీసుకునే విధంగా ప్రత్యేక కార్యాచరణను ప్రభుత్వం అమలు చేయాలన్నారు. గుడ్లు, పాలు, బాలామృతం, మధ్యాహ్న భోజనం అందజేయాలన్నారు.

జాబ్ మేళాలో 42మంది ఎంపిక

రాయచోటి : రాయచోటి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో నిర్వహించిన జాబ్ మేళాలో 42 మందికి ఉద్యోగ అవకాశాలు అందించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శివసంకర్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాకు 150 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాలో ఐదు బహుళ జాతీయ కంపెనీలు పాల్గొన్నాయి. 42 మందిని ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు.

ఆర్బీకేల తనిఖీ

సిద్దవటం : మండలంలోని బొగ్గిడివారిపల్లె, మాధవరం–2 రైతు సేవా కేంద్రాలను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశామని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన రైతు సేవా కేంద్రాల్లోని పలు రకాల రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. ఇ–పంట నమోదు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పెద్దపల్లె రెవెన్యూ గ్రామంలోని శివునిపల్లెకు చెందిన గోపినేని కొండయ్య పసుపు పంటలో జరిగే పంట నమోదును పరిశీలించి రైతుకు సూచనలు చేశారు.